
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 18.0
ANDHRAJYOTHY
3



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శనివారం 17 ఫిబ్రవరి 2024

మూడు ఉద్యోగాలు సాధించిన యువతి

మానవపాడు, ఫిబ్రవరి 16 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం అమరవాయి గ్రామానికి చెందిన ఏ.బేబిగౌడ్ అనే యువతి ఇటీవల పీడీ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలు మూడింటిలో ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గురుకుల పాఠశాలలో పీఈటీ, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పీడీ పోస్టులు సాధించింది. అయితే డిగ్రీ కళాశాలలో పీడీ పోస్టు కోసం గురుకుల సంస్థ ఎండీ మల్లయ్యభట్టు చేతులమీదుగా బేబిగౌడ్ నియామక పత్రం అందుకున్నట్లు కుటుంబీకులు తెలిపారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



మూడు ఉద్యోగాలు సాధించిన బేబిగౌడ్



గద్వాలలో ర్యాలీ చేస్తున్న కార్మికులు



నారాయణపేటలో బైక్, ఆటో ర్యాలీ చేస్తున్న కార్మికులు, నాయకులు



జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



మహబూబ్‌నగర్‌లోని విద్యుత్ భవన్ వద్ద భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కదం తొక్కిన కార్మికులు



వనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆల్ ట్రేడ్ యూనియన్స్, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్మికులు కదం తొక్కారు. ప్రదర్శనలు, ఆందోళనలు, బైక్, ఆటో ర్యాలీలు నిర్వహించారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీతో పాటు పలు సంఘాలు, అనుబంధ సంఘాలు, అఖిలపక్ష పార్టీల నాయకులు సమ్మెలో పాల్గొన్నారు. పాలమూరులోని తెలంగాణ చౌరస్తాలో కార్మిక సంఘాలు ధర్నా చేయగా... విద్యుత్ భవన్ వద్ద ఆ శాఖ ఉద్యోగులు, టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉద్యోగులు భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలను అమలు చేయాలని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



ఆత్మకూర్ గాంధీ చౌరస్తాలో మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

గడప దాటని అక్షరాస్యత

- గట్టు మండలంలో పథకాలెన్ని ప్రారంభించినా ఫలితం నిల్
- ఏళ్లుగా వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- 372కు గాను 173 పోస్టులే మంజూరు
- పడిపోతున్న విద్యా ప్రమాణాలు
- మండలంలో 2,236 మంది బడిబయటి పిల్లలు
- అధికారులు చెబుతున్నది 173 మంది మాత్రమే..
- సమస్యలు పరిష్కరించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి ఇటీవల విద్యార్థుల లేఖలు

గట్టు, ఫిబ్రవరి 16 : గట్టు.. ఈ పేరు వినగానే అక్షరాస్యతలో వెనుకబడ్డ ప్రాంతమని అందరికీ గుర్తొస్తుంది. నిరక్షరాస్యతలో దేశంలోనే రెండో స్థానంలో ఉన్న ఈ ప్రాంతంలో అక్షరాస్యతను పెంచడానికి ఎన్ని పథకాలను ప్రారంభించినా ప్రయోజనం లేకుండా పోయింది. 1995 నుంచి ఉమ్మడి రాష్ట్రాన్ని ఏలిన ప్రభుత్వాలు ఇక్కడి నుంచి అక్షరాస్యత కార్యక్రమాలు నుంచే మొదలు పెట్టినా.. స్వచ్ఛంద సంస్థలు దత్తత తీసుకున్నా.. అక్షరాస్యత శాతం గట్టు గడప దాటడం లేదు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడం, ఉపాధ్యాయుల కొరత, ప్రజా ప్రతినిధుల పట్టింపులేని తనం కారణంగా లక్ష్యం నెరవేరడం లేదనే విమర్శలొస్తున్నాయి. తాజాగా గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి మండలంలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని లేఖలు రాయడంతో ఇక్కడి అక్షరాస్యత మరోసారి చర్చకు వచ్చింది.

అన్ని పథకాలూ ఇక్కడి నుంచే ప్రారంభం

అక్షరాస్యత అభివృద్ధికి సంబంధించిన పథకాలన్నీ ఉమ్మడి రాష్ట్రంలో గట్టు మండలం నుంచే ప్రారంభమయ్యాయి.



ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి, పాఠశాల సమస్యలను తీర్చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలను చూపుతున్న గట్టు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు(ఫైల్)

బడిబయటే పిల్లలు

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో చదువులు అంతంత మాత్రంగానే సాగుతుండటంతో పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలకు కాకుండా పనులకు పంపుతున్నారన్న విమర్శలున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను పొలం పనులకు పంపుతున్నారు. ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఇంటింటికి తిరిగి బడి బయటి పిల్లలపై సర్వే చేశారు. మండలంలోని 32 గ్రామాల్లో 2,236 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు తెలింది. వారంతా 6-14 ఏళ్లలోపు వారే. కానీ.. విద్యా విద్యాశాఖ మాత్రం కేవలం 173 మంది మాత్రమే బడి బయట ఉన్నట్లు చూపుతోంది. బడిలో ఉండాల్సిన బాల్యం బడి బయట ఉంటూ, చదువుకు దూరమవుతున్నా ప్రభుత్వాలు ఉపాధ్యాయులను నియమించడం లేదు. బడి బయటి పిల్లల కోసం ఏటా బడి బాట వంటి కార్యక్రమాలు చేపడుతున్నా.. ఫలితాలను ఇవ్వడం లేదు.

- 1995-96లో మొదటగా అక్షరాస్యత పెంపొందించేందుకు అప్పటి కలెక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో అక్షరకిరణం పథకం ప్రారంభం
- 2003-04లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చదువుకుందాం రా.. పథకం గట్టులో ప్రారంభం
- 2011లో మంత్రిగా ఉన్న డీకే అరుణ సాక్షర భారత్ అనే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని గట్టు నుంచే మొదలు పెట్టారు.
- ఇందిరమ్మ బాట సందర్భంగా గట్టుకు వచ్చిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గట్టు బ్రిడ్జి స్కూల్లో విద్యాజ్యోతి పథకాన్ని ప్రారంభించారు.



గట్టు మండలం చాగదోణ ఉన్నత పాఠశాల

పడిపోతున్న ఫలితాలు

మండలంలో 48 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో పీఎస్‌లు 34, యూపీఎస్‌లు ఐదు, ఎంపీహెచ్ఎస్‌లు ఐదు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఏడు ఉన్నాయి. ఇవి కాకుండా కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. ప్రధానంగా ఉపాధ్యాయుల కొరతతో విద్యా ప్రమాణాలు పడి పోతున్నాయి. పదో తరగతిలో 2021-22 విద్యా సంవత్సరంలో 90 శాతం ఉన్న ఉత్తీర్ణత.. 2022-2023 వచ్చే సరికి 64 శాతానికి పడిపోయింది. చాగదోణలో 28 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే.. ఏడుగురు మాత్రమే పాస్ అయ్యారు.

అయినా గట్టు మండలంలో 1996 నుంచి 2012 వరకు 18 శాతం మాత్రమే అక్షరాస్యత నమోదైంది. 2000 సంవత్సరం నాటికి రెండు శాతం పెరిగి 20 శాతానికి చేరింది. 2001లో జనాభా లెక్కల ప్రకారం 22.65 శాతం నమోదైంది. అక్షరాస్యత పెంపునకు ప్రభుత్వాలు తీసుకున్న చర్యలతో గట్టు ఉమ్మడి మండలంలో కొద్ది మేర మాత్రమే ఫలితాలు సాధించగలిగారు. కానీ వంద శాతం అక్షరాస్యత సాధించాలన్న లక్ష్యాన్ని చేరుకో లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం 37 శాతానికి చేరుకున్నది. మండలానికి నవోదయ, కేంద్రీయ విద్యాలయం ఇస్తామని హామీలిస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.

372 పోస్టులకు 173 మందే ఉపాధ్యాయులు

మండలంలోని పాఠశాలలను 20 ఏళ్లుగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. మండలంలో ప్రస్తుతం 8,453 మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందుకు గాను విద్యాహక్కు చట్టం ప్రకారం 372 ఉపాధాయ పోస్టులు ఉండాలి. కానీ ప్రస్తుతం 218 పోస్టులు మాత్రమే మంజూరయ్యాయి. ఇందులో కూడా 173 మంది మాత్రమే పని చేస్తున్నారు. 45 ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. ఏడు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయి. గట్టుకు ప్రత్యేకంగా పోస్టులు మంజూరు చేయించాల్సిన ప్రజా ప్రతినిధులు వినతులు అందించడానికి మాత్రమే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు హైకోర్టు న్యాయమూర్తులకు, ఉమ్మడి రాష్ట్రంలోని ముఖ్యమంత్రులకు లేఖలు రాసినా పరిస్థితిలో మార్పు లేదు. తాజాగా గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నాలుగు రోజుల కిందట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గట్టు మండలంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లేఖలు రాశారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర అంతంతే..

గట్టు విద్యాభివృద్ధిలో పాత్రులు కావాలంటూ అప్పటి ప్రభుత్వాలు పిలుపు ఇవ్వడంతో రాష్ట్రంలోని అనేక స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. వాటికి ప్రభుత్వాల నుంచి సహాయ సహకారాలు అందాయి. కానీ ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయాయి. నిధులు కరిగిపోయాయి తప్ప. అక్షరాస్యత శాతం మాత్రం పెరగలేదని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. వందేమాతరం ఫౌండేషన్, రాజీవ్ ఫౌండేషన్, కేర్ సంస్థ, ఎంవీఎఫ్ ఫౌండేషన్ వంటి అనేక స్వచంద సంస్థలు గట్టులో విద్యాభివృద్ధికి కృషి చేశాయి. కాని అక్షరాస్యత శాతం మాత్రం గట్టు గడప దాటలేక పోయింది.

మెరుగైన ఫలితాలకు చర్యలు



ఉపాధ్యాయ పోస్టుల భర్తీ వచ్చే విద్యా సంవత్సరమే ఉండొచ్చు. ప్రస్తుతానికి ఒక నెల కోసం గట్టుకు విద్యా వలంటీర్లను తీసుకున్నాము. పదో తరగతిలో గత సంవత్సరం తక్కువ ఫలితాలు వచ్చినందున గట్టుకు ఆరు గురు విద్యా వలంటీర్లను ఇచ్చాం. ఇందువాసికి ఇద్దరు, బోయలగూడేనికి ఇద్దరు, మాచర్లకు ఒకరు, గోర్లఖాన్‌దొడ్డికి ఒకరి చొప్పున నియమించాం. ఇలా జిల్లాలో 40 మంది విద్యా వలంటీర్లను నియమాంచాము. మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఇందిర, ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి

లెక్క తేలింది

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,192 మంది బడి బయటి పిల్లలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో అధికంగా 1,212 మంది



మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి తండాలో బడిబయటి పిల్లల సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ బృందం(ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 16: బడి ఈడు పిల్లల లెక్క తేలింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో గత డిసెంబరు 11 నుంచి జనవరి చివరి వరకు బడి ఈడు, బడి బయటి పిల్లల సర్వే నిర్వహించారు. మొదట జనవరి 10 వరకే చేయాలని షెడ్యూల్ ఇవ్వగా, పూర్తికాకపోవడంతో జనవరి చివరి వరకు గడువు పొడిగించారు. ఈ సర్వేలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. ఆరేళ్ల నుంచి 14 ఏళ్లు, 15 నుంచి 19 ఏళ్ల లోపు ఉన్న బడి బయటి పిల్లలు 3,192 మందిగా తేల్చారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమన్వయకర్తల పర్యవేక్షణలో సీఆర్పీ(క్లస్టర్ రిసోర్స్ పర్సన్), ఐఈఆర్పీ(విలీన విద్యా రిసోర్స్ పర్సన్)లు బృందాలుగా ఏర్పడి సర్వే చేశారు. ఆరు నుంచి 14 ఏళ్ల వయస్సు ఉండి, పాఠశాలల్లో పేరు నమోదు కాని, బడిలో చేరినా 30 రోజులు బడి ముఖం చూడని వారిని బడి బయట పిల్లలుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2,332 బడి బయటి పిల్లలు ఉన్నట్లు తేల్చారు. 10 నుంచి 19 ఏళ్లు ఉండి, విద్యాభ్యాసానికి నోచుకోని వారు 860 మంది ఉన్నట్లు తేలింది. వీరి విద్యాభ్యాసం కోసం జిల్లాల వారీగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాల వారీగా బడి బయటి, బడి ఈడు పిల్లల వివరాలు

జిల్లా	6 నుంచి 14 ఏళ్లు పిల్లలు	15 నుంచి 19 ఏళ్ల పిల్లలు
మహబూబ్‌నగర్	351	90
నాగర్‌కర్నూల్	237	106
నారాయణపేట	323	256
వనపర్తి	474	143
జోగుళాంబ గద్వాల	947	265
మొత్తం	2332	860

ప్రణాళికలు ఇలా..

బడి బయట ఉన్న పిల్లలను సమీపంలోని విద్యాలయాల్లో చేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా అనాథలు, తల్లి లేదా తండ్రి లేని వారు, బలహీన వర్గాలకు చెందిన, ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించారు. వచ్చే విద్యా సంవత్సరంలో వారిలో బాలికలను కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో, బాలురను అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పించనున్నారు. 30 రోజుల నుంచి ఆరు నెలల వరకు పాఠశాలలకు రాని వారి కోసం మూడు నుంచి ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు నిర్వహించి, యథావిధిగా సంబంధిత తరగతుల్లో చేర్పిస్తారు. 15 నుంచి 19 ఏళ్ల వయస్సున్న విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ ప్రవేశాలు కల్పించనున్నారు.

బడిలో చేర్పించేలా చర్యలు



బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి, వారికి విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. బడి ఈడు పిల్లలు ఎంత మంది ఉన్నారని జిల్లాలో పకడ్బందీగా సర్వే చేశాం. క్షేత్ర స్థాయిలో పర్యటించి, విద్యార్థుల వివరాలను సేకరించాం. బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాం.

- రవీందర్, మహబూబ్‌నగర్ డీఈవో

పాత సామాన్ల గోదాంలో అగ్ని ప్రమాదం

- రూ. 5 లక్షల ఆస్తి నష్టం
- భారీగా ఎగిసిపడిన మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



మంటల్లో దగ్ధమౌతున్న పాత వాహనాలు

అచ్చంపేట, ఫిబ్రవరి 16 : పాత సామాను దుకాణంలో భారీగా మంటలు చెలరేగి ఆస్తి నష్టమైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో స్థానికుడైన ఖాజా పాత సామాను దుకాణం ఉన్నది. గుర్తుతెలియని వ్యక్తి సిగరేట్ కాల్చిపడేయడంతో ఆ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు దాదాపు మూడు గంటలు పట్టింది. పాత ఇనుప సామాను దుకాణంలో కార్లు, ట్రాక్టర్లు కాలిబూడిదైపోయాయి. దాదాపు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. భారీగా మంటలు ఎగిసిపడటంతో పట్టణంలో పెద్దఎత్తున పొగలు వ్యాపించి ప్రజలు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ప్రజలు అక్కడికి చేరుకొని ఏం జరిగిందోనని చూశారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కల్యాణం కమనీయం

- భలాన్‌పల్లిలో ఘనంగా సూర్యభగవానుడి వివాహం
- స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

తాడూరు, ఫిబ్రవరి 16: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం భలాన్‌పల్లి గ్రామంలో సూర్యనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఛాయాదేవి, సూర్యనారాయణస్వామిల వివాహ వేడుకను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం చుట్టూ ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ప్రదక్షిణలు నిర్వహించారు. శనివారం మూడో రోజు సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి భజన పోటీల్లో వనపర్తి జిలా మదనాపురం భజన మండలి ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భలాన్‌పల్లి గ్రామం నుంచి సూర్యనారాయణస్వామి దేవాలయం వరకు రెండు కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు గ్రామస్థులకు హామీ ఇచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



హాజరైన భక్తులు









ప్రమాదభరితం కూలీల ప్రయాణం

- డబ్బు కక్కుర్తితో అధికంగా వాహనాల్లో తరలింపు
- ఘటనలు జరిగినప్పుడే ఉరుకులు, పరుగులు



చిన్న వడ్డెమాన్ సమీపంలో వాహనంలో ఎక్కేందుకు గుమిగూడిన కూలీలు

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 16 : జిల్లాలో తరచూ ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదం జరుగుతున్నా, జనం మాత్రం వాటిని పట్టించుకోవటం లేదు. ఎలాంటి భయం లేకుండా అలాగే వాహనాల్లో వేలాడుతూ మరీ ఎక్కి ప్రయాణిస్తున్నారు. మండలంలో ప్రస్తుతం మిరప పంట ఏరివేతకు కూలీలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఏదులాపూర్, దాసర్‌పల్లి, అప్పంపల్లి, పర్దీపూర్, దమగ్నాపూర్, ఉంద్యాల, అమ్మాపూర్, తిర్మలాపూర్ గ్రామాల శివారుల్లో రైతులు పెద్ద ఎత్తున మిరప, పత్తి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పత్తి సీజన్ ముగిసినా, మిరప పంట ఏరివేత పనులు కొనసాగుతున్నా యి. కూలీలకు విపరీతంగా డిమాండ్ ఉండటంతో ఇతర మండలాలకు చెందిన కూలీలను వాహ నాల్లో రైతులు ఖర్చులు భరించి మరీ తీసుకు వస్తున్నారు. ఇదే క్రమంలో వాహనదారులు కూలీ లు, రైతులకు అత్యవసరాన్ని బట్టి, వాహనాల్లో పరిమితికి మించిన కూలీలను తరలిస్తున్నారు. బొలెరో, ఆటోల్లోనూ నిబంధనలను అతిక్రమించి, ఎక్కువ మంది కూలీలను తరలిస్తున్నారు. ఆటో లో డ్రైవర్ పక్కనే నలుగురి నుంచి ఆరుగురిని కూర్చో బెట్టుకొని వెళ్తున్నారు. ఆటోల్లో కూలీలను ఎక్కువ మందిని తరలించటం వల్ల గతంలో పలు ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. గతంలో కురుమూర్తి గ్రామ సమీపంలోని కూలీలను తీసుకువెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైన ఘటనలున్నాయి. దీనిపై నియంత్రణ ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు
ఎస్ఐ శేఖర్

మండలంలోని ఆయా గ్రామాల శివారుల్లో మిరప పంట ఏరివేతకు కూలీలను వాహన దారులు తీసుకొస్తున్నారని, కూలీలను తరలించే క్రమంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. పరిమితికి మించిన కూలీలను ఆటోల్లో తరలించి, వారి ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు.



వాహనంలో సామర్థ్యానికి మించి ఎక్కిన కూలీలు

సామాజిక అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలి

- ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ




విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ


మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 16 : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ వారం రోజుల క్యాంపులో గ్రామంలోని ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మండలంలోని కోటకదిర గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఐదవ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ వారం రోజుల క్యాంపు ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరైన పీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ హాజరై ప్రసంగించారు. వలంటీర్లు క్రమశిక్షణతో మెలగాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండేలా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నాగరాజు గ్రామ కార్యదర్శి మాధవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ కళాకారుడి మృతి

గద్వాల టౌన్, ఫిబ్రవరి 16 : పట్టణ ప్రజలకు చిరపరిచితుడైన సీనియర్ కళాకారుడు ఎం.ఎ.కరీం(96) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక మోమిన్‌మొహల్లాలోని తన నివాసంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కరీంకు భార్య ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. తన అద్భుతమైన చిత్రకళతో రాష్ట్ర స్థాయిలో పలు పురస్కారాలు అందుకున్న కరీం ముప్పై ఏళ్ల క్రితం పట్టణం లోని బాలభవన్‌లో వేసిన వినాయకుడి పెయింటింగ్ అందరి ప్రశంసలను అందుకుంది. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత వారి నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట కౌన్సిలర్లు వసీమాబేగం, శంకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, మల్లారెడ్డి, ఖిఫాయత్, దినేష్, ఇలియాస్, బీసన్న ఉన్నారు.









గుట్టలు తవ్వి.. గుంతలు చేసి

- ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- ప్రశ్నిస్తే బెదిరింపులు,
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మట్టి కోసం పెద్దపెద్ద గుట్టలను తవ్వుతున్నారు. గుట్టలు కాస్తా.. నేడు పెద్ద గుంతలుగా మారాయి. మట్టి కోసం రెండు లేదా మూడు ఫీట్ల లోతు వరకు భూమిని తవ్వి మట్టిని విక్రయించే అక్రమార్కులు.. ఏకంగా 40 ఫీట్ల లోతులోకి తవ్వేస్తున్నారు. ఈ తతంగమంతా రాత్రివేళల్లో దర్జాగా నిర్వహిస్తున్న అక్రమార్కులు... 44వ నెంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు నెలకొల్పిన పోలేపల్లి సెజ్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. భూమి లెవలింగ్ కోసం ఏకంగా వందలాది టిప్పర్ల మట్టిని దర్జాగా తరలిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

- జడ్చర్ల



జడ్చర్ల మండలం గొల్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ముదిరెడ్డిపల్లి వెళ్లే దారిలో మట్టిని తవ్వగా ఏర్పడిన పెద్ద గుంతలు

జడ్చర్ల మండలం గొల్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ముది రెడ్డిపల్లికి వెళ్లే దారిలో ఓ అక్రమార్కుడు చిన్న పాటి మైనింగ్‌ను తలపించే విధంగా మట్టి తవ్వకాలు చేపట్టాడు. సుమారు వంద మీటర్ల మేర వేలాది టిప్పర్ల మట్టిని తవ్వేసాడు. ఇప్పటికే దాదాపు 20వేల టిప్పర్ల మట్టిని తవ్వి, కోట్ల రూపాయలను గడించాడన్న ఆరోపణలున్నాయి. పోలేపల్లి సెజ్ పరిసర ప్రాంతంలో ఏకఛత్రాధి పత్యంగా ఈ అక్రమ మట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఏకైక వ్యక్తిగా ప్రత్యేక గుర్తింపు పొందిన సదరు అక్రమార్కుడికి అధికారులు సైతం సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

రాత్రివేళలో తవ్వకాలు

రాత్రి వేళల్లో మట్టి తవ్వకాలను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. ఎక్స్‌కవేటర్‌లతో మట్టిని తోడి, టిప్పర్‌లలో పోసి, రాత్రి నుంచి ఉదయం వరకు ఈ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సుమారు 40 ఫీట్ల లోతులో తవ్వుతున్న మట్టిని టిప్పర్‌లలో తరలించేందుకు దారి మాదిరిలా ర్యాంప్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు

గుట్టలను తవ్వి, పెద్దపెద్ద గుంతలను చేసి వేలాది టిప్పర్ల మట్టిని తవ్వేస్తున్న ఘటనా స్థలం వైపు రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖలు చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్‌లతో మట్టిని తవ్వి, టిప్పర్‌లలో అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై మౌఖికంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రశ్నిస్తే.. భయభ్రాంతులు

అక్రమంగా మట్టిని తరలిస్తున్న తీరుపై ఎవరైనా ప్రశ్నిస్తే, వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వుతున్న ప్రాంతం అంతా ప్రభుత్వ భూమి అని, ఈ విషయం తెలిసినా ఒక్క అధికారి పట్టించుకున్న సందర్భం లేదంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని ఎలా తరలిస్తావని సదరు అక్రమార్కుడిని ప్రశ్నించిన వారిలో కొందరిని ప్రలోభపెట్టడం, మరికొందరిని భయభ్రాంతులకు గురిచేస్తారంటూ స్థానికులు వాపోయారు.

ప్రమాదకరంగా విద్యుత్ టవర్

అక్రమంగా మట్టిని తవ్వుతున్న ప్రాంతంలో విద్యుత్ టవర్ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. హైవోల్టేజ్ విద్యుత్ లైన్ కోసం ఇటీవల ఆ ప్రాంతంలో నూతనంగా టవర్‌ను నిర్మించారు. ఆ విద్యుత్ టవర్ చుట్టూ మట్టిని తవ్వడంతో ఓ మట్టిదిబ్బపైన ప్రస్తుతం విద్యుత్ టవర్ ఉంది. ఏకధాటిగా వర్షం పడినా, మట్టి కూలినా విద్యుత్ టవర్ కూలిపోయే విధంగా ఉంది. అయినా సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్ సైతం పట్టించుకోకపోవడం విశేషం.



జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లోకి వెళ్లే జాతీయ రహదారి పక్కన కుప్పలు, కుప్పలుగా పోసిన అక్రమంగా తరలించిన మట్టి

జడ్చర్లకు బైపాస్ రోడ్డు మంజూరు చేయాలి

- వంద పడకల ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించాలి
- అసెంబ్లీలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల, ఫిబ్రవరి 16 : జడ్చర్ల పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయించి, నిర్మాణం చేపట్టాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం జీరోఅవర్‌లో జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనుల అంశంపై ఆయన ప్రస్తావించారు. జడ్చర్లలోని జాతీయ రహదారికి ఒకవైపు మహబూబ్‌నగర్, మరోవైపు కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ పట్టణాలు ఉన్నాయని, ఈ రెండువైపులా బైపాస్ రోడ్డు మంజూరు చేయించి, నిర్మాణం చేపట్టాలని, అదేవిధంగా, జడ్చర్లలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రిలో టెక్నీషియన్స్, డాక్టర్స్ లేరని, వెంటనే సిబ్బందిని కేటాయించాలని, ముస్లింలకు ఖబర్‌స్థాన్ కోసం మూడెకరాల భూమిని కేటాయించాలని కోరారు. బైపాస్ నిర్మాణ విషయమై కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరామని, డీపీఆర్ చేయాలంటూ ఇంజక్షన్ ఇచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

కేఎల్ఐ డీ-82ను పూర్తి చేసి సాగునీరందించాలి

- అసెంబ్లీలో కోరిన కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : కేఎల్ఐ డీ-82ను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడారు. కేఎల్ఐ డీ-82లో ఒక రైతుకు రూ.5లక్షలు పెండింగ్ ఉందని రూ.40కోట్లు ప్రభుత్వం కేటాయిస్తే పనులన్ని పూర్తయి రైతులకు సాగునీరందుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఆమనగల్ పట్టణంలోని 30పడకల ఆసుపత్రిని 10పడకలకు తగ్గించారని, ఎన్నికల సమయంలో దానిని 50పడకలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదని దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే, ఆమనగల్‌లో ఇంటర్ కళాశాల భవన నిర్మాణం ఏళ్లకాలంగా పెండింగ్‌లోనే ఉందని, భవన నిర్మాణానికి స్థల వివాదం అడ్డు వస్తుందని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి కోమటి వెంకట్‌రెడ్డి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

50 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలి

- సీఎంకు దేవరకద్ర ఎమ్మెల్యే విజ్ఞప్తి



కొత్తకోట, ఫిబ్రవరి 16 : మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కొత్తకోటలో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయాలని అసెంబ్లీలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రసంగించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. శుక్రవారం అసెంబ్లీలో వచ్చిన అవకాశాన్ని ఆసుపత్రి మంజూరు కోసం వినియోగించుకున్నందుకు మండల ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ, ఫిబ్రవరి 16 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని జకినాలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్సై ఇస్మాయిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొలే బాలయ్య(62) ఈనెల 14న వ్యవసాయ పనులు ముగించుకొని ఇంట్లోకి రాగానే కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పొలే కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ, ఫిబ్రవరి 16 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వెంకటామ్మకుంటతండా వద్ద శుక్రవారం తెల్లవారుజామున టంకరకు చెందిన ట్రాక్టర్ నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

● తెలకపల్లి : దుందుభి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం నడిగడ్డ బ్రిడ్జి వద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. నడిగడ్డకు చెందిన వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్‌ను పట్టుకుని, డ్రైవర్ గుంపాల కాశన్నపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆవిష్కరణలు రైతులకు ఉపయోగం

- కలెక్టర్ రవినాయక్
- వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్ ప్రారంభం
- శిల్పారామంలో ఆవిష్కరణల ప్రదర్శన



అన్నం వండి వార్చి ఇతర ప్రాంతాలకు సులువుగా తరలించే యంత్రాన్ని కలెక్టర్‌కు వివరిస్తున్న విద్యార్థిని

పాలమూరు, ఫిబ్రవరి 16 : ఆవిష్కరణల ఆవిష్కర్తలు, రైతుల మధ్య సంబంధాలను పెంపొందించుకోవడానికి వన్ డిస్ట్రిక్ట్, వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి.రవి నాయక్ తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ), నాబార్డ్ (ఎస్‌పీబీఏఆర్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ టీఎస్ఐసీ, నాబార్డు సంయుక్తంగా ఏర్పాటు చేసిన వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన అభినందించారు. వ్యవసాయం, నీటి వ్యవస్థలు, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణ సంఘాలను మెరుగుపరచడానికి మార్గాలను కనుగొన్న 30 మంది ఆవిష్కర్తల నుంచి రూపుదిద్దుకున్న ప్రదర్శనలు వీక్షించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణల కోసం మార్కెట్‌ను సృష్టించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలు, ఆవిష్కరణలు, లబ్ధిదారుల మధ్య విలువైన సంబంధాలను సులభతరం చేయటమే కాక రైతులు, స్థానిక సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి వినూత్న పరిష్కారాలను స్వీకరించి, అమలు చేయడంపై చర్యలను ప్రోత్సహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం షణ్ముఖచారి, జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్, ఏడీఎం అఖిల్‌పున్నా, టీఏఎస్ఐసీ(లీడ్ ఫర్ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్) సోహెల్ తదితరులు పాల్గొన్నారు.



కూర్చున్న వద్ద నుంచే ఫ్యాన్‌ను ఎక్కువ, తక్కువ చేసుకునే విధానాన్ని వివరిస్తున్న మహిళ

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

- కన్నతల్లిపై బంధువుల అనుమానం



మృతి చెందిన జాను(ఫైల్)

లింగాల, ఫిబ్రవరి 16 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కొత్తకుంటపల్లిలో ఓ బాలిక అనుమానాస్పదంగా మృతి చెందింది. సీఐ రవీందర్, ఎస్సై జగన్‌మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తగిలి తిరుపతయ్య, మహేశ్వరి అనే దంపతులు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. తిరుపతయ్య నాగర్‌కర్నూల్‌లో ప్రైవేటుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. మహేశ్వరి తన ముగ్గురు చిన్నారులతో కలిసి గ్రామంలోనే నివసిస్తోంది. గురువారం రాత్రి గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లిన మహేశ్వరి మద్యం తాగి ఇంటికి వచ్చింది. మద్యం మత్తులో ఉన్న ఆమె రెండో కూతురు జాను(6)ను చితక బాదింది. దీంతో బాలిక మృతి చెందింది. శుక్రవారం బాలిక శరీరంపై దెబ్బలు గమనించిన బంధువులు ఉద్దేశపూర్వకంగానే బాలికను చంపి నట్లు తల్లిపై అనుమానం వ్యక్తం చేశారు. బాలిక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతోంది. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ, ఎస్సైలు తెలిపారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలకు రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 16 : ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఒక కానిస్టేబుల్ సెల్‌ఫోన్ అపహరించుకుని పారిపోతుండగా నిందితుడు ఏసును పట్టుకుని విచారించగా మరో వ్యక్తి ఎరుకలి రాజుతో కలిసి మొబైల్ దొంగతనం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వీరి వద్ద ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకుని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలి పారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మహిళ అదృశ్యం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ఓ మహిళ అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన వేణుగోపాల్ భార్య రేణుక(40)తో కలిసి కుమార్తెను చూడటానికి నగరానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కడానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. భర్త వేణుగోపాల్ దివ్యాంగుడు కావడంతో వీల్‌ఛైర్‌లో నాలుగో ప్లాట్‌ఫారం వైపు వెళ్లాడు. రేణుక ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కింది. ఎంతసేపైనా ఆమె రాలేదు. రేణుక ఆచూకీ లభించకపోవడంతో వేణుగోపాల్ కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అధ్వానంగా ప్రాజెక్టు రోడ్డు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- మొదట్లో హడావుడి.. ఆ తర్వాత మందగింపు
- విస్తరణ కోసం రోడ్డుకిరువైపులా తవ్వకాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 16 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు మీదుగా ఆత్మకూరుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మండలంలోని నందిమల్ల, మూలమల్ల గ్రామాల మీదుగా ప్రాజెక్టుకు వెళ్లేందుకు ఏడు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిధుల నుంచి రూ.8.30 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆత్మకూరు నుంచి ప్రాజెక్టుకు వెళ్లే ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కృష్ణా పుష్కరాల నిమిత్తం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అత్యధికంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మీదుగా వేలాదిమంది ప్రయాణికులు వాహనాల మీదుగా వచ్చే అవకాశం ఉందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్ల 30 లక్షలు ప్రాజెక్టు నిధుల ద్వారా మంజూరు చేసి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా అప్పటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రోడ్డు మరమ్మతుల విషయమై భూమిపూజ చేసి, మరమ్మతులు చేపట్టారు. ప్రారంభించిన మొదట్లో సంబంధిత గుత్తేదారులు ప్రాజెక్టు నుంచి నందిమల్ల, మూలమల్ల గ్రామాల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి రోడ్డు ఇరువైపులా తవ్వి మరమ్మతు పనులు చేపట్టారు.

నేటికీ పూర్తికాని పరిస్థితి

11 కిలోమీటర్ల మేర, 18 ఫీట్లు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత గుత్తేదారులు మొదట్లో వడివడిగా రోడ్డుకిరువైపులా తవ్వి పనులు చేపట్టారు. అంతలో కృష్ణా పుష్కరాలు ముంచుకురావడంతో వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయని నిలిపివేశారు. ఇదే అదనుగా భావించి రెండు కోట్ల రూపాయలకు పైగా బిల్లులు తీసుకుని బిల్లును సరిపోవడం లేదని మధ్యలోనే నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టు అధికారులు సమావేశం నిర్వహించి, సంబంధిత గుత్తేదారులను ఆరా తీయగా బిల్లులను సరిపోవడం లేదని ముఖం చాటేయడంతో ప్రాజెక్టు అధికారులు గుత్తేదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ప్రాజెక్టుకు వెళ్లే సందర్శకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, తక్షణమే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా, రాస్తారోకో చేపట్టారు.

గద్వాల నుంచి నిలిచిన ఆర్టీసీ బస్సులు

జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వనపర్తి జిల్లాకు వెళ్లేందుకు ప్రాజెక్టు మీదుగా ప్రధాన రహదారి కావడంతో రోజువారీగా వందల సంఖ్యలో వాహనాలు తరలివెళ్తుండేవి. ఈ క్రమంలో రోడ్డు మరమ్మతు పనులు నిలిచిపోవడంతో ఎక్స్ రోడ్డు మస్తీపూర్, అమరచింత మండలాల మీదుగా ఆరు కిలోమీటర్లు అధిక ప్రయాణం చేసి ఆత్మకూరుకు చేరుకునే దుస్థితి నెలకొందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నందిమల్ల, మూలమల్ల గ్రామాల మీదుగా వందల సంఖ్యలో ప్రయాణికులు ఆత్మకూరుకు రోజువారీగా వెళ్తుంటారు. ఆయా గ్రామాల మీదుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో జోగుళాంబ గద్వాల జిల్లా ఆర్టీసీ బస్సులు రావడం మానేశాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, ప్రాజెక్టుకు వెళ్లే సందర్శకులు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికలకు ముందు ప్రచారాలు నిర్వహించేందుకు వచ్చిన రాజకీయ పార్టీల నాయకులను నిలదీయగా అధికారం చేపట్టిన వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. నూతనంగా అధికారం చేపట్టిన వెంటనే ప్రాజెక్టు రోడ్డును పంచాయతీరాజ్ శాఖకు అప్పగించి రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అందాలను తిలకించే విధంగా ప్రయాణానికి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



నందిమల్ల వద్ద ధ్వంసమైన ప్రాజెక్టు రోడ్డు



గుంతలమయంగా ఏర్పడిన మూలమల్ల గ్రామం వద్ద ప్రాజెక్టు రోడ్డు



గత వర్షాకాలంలో పరిస్థితి ఇలా.. (ఫైల్ ఫొటో)

మధ్యలోనే నిలిపివేశారు..



కృష్ణా పుష్కరాల సమయంలో ప్రారంభించిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు రోడ్డు మధ్యలోనే నిలిపివేయడం సరైంది కాదు. మధ్యలోనే నిలిపివేయడంతో జోగులాంబ జిల్లా గద్వాల నుంచి నందిమల్ల, మూలమల్ల గ్రామాల మీదుగా వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు అధికారులు తక్షణమే స్పందించాలి.

- హనుమంత్, నందిమల్ల ఎంపీటీసీ సభ్యుడు

తక్షణమే విస్తరణ పనులు చేపట్టాలి..



తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. ప్రతీ ఏడు జూరాల ప్రాజెక్టుకు వరద వస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల నుంచి ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో సందర్శకులతో పాటు, రోజువారీగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- మోష, మూలమల్ల గ్రామవాసి

మిర్చి మార్కెట్‌గా భూత్పూర్ సంత

- జిల్లా నలుమూలల నుంచి కొనుగోలు చేయడానికి వస్తున్న జనం
- ఇరవైయేళ్లుగా భూత్పూర్ సంతలో మిర్చి ఫేమస్
- గిట్టుబాటు ధరలకు అమ్ముకుంటున్న రైతులు



సంతలో ఒట్టి మిర్చిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

భూత్పూర్, ఫిబ్రవరి 16 : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం జరిగే సంతలో వట్టికాయల మిర్చికి ఉమ్మడి జిల్లాలోనే ఎనలేని డిమాండ్ ఉంది. ప్రస్తుతం చట్నీల సీజన్ రానుండడంతో అందుకు తగ్గ మిర్చిని కొనడానికి జనాలు ఇక్కడికి వస్తుంటారు. ఏడాదికి సరిపడా మిర్చిని ఇక్కడ కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. జిల్లా నలుమూలల నుంచి మిర్చి పంటను పండించిన రైతులు సాధారణ మార్కెట్ కంటే మంచి గిట్టుబాటు ధరకు ఇక్కడ అమ్ముకుంటారు. టోకు కంటే చిల్లర వ్యాపారమే బాగుందని మిర్చి పండించిన రైతులు చెబుతున్నారు. ఈ సంతకు తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ, మారేపల్లి, ఐతోల్, మిడ్జిల్, సిల్వేరు, అదేవిధంగా గద్వాల జిల్లా నుంచి ఎర్రవల్లి, అలంపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి, మంగనూరు తదితర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో రైతులు వారు పండించిన వట్టికాయల మిర్చిని అమ్ముకోవడానికి ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో మిర్చిని తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటారు. నేరుగా రైతులే వచ్చి మిర్చిని అమ్ముతుండడంతో చాలామంది తాజా మిర్చి దొరుకుతుందని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు. ఎక్కువగా ఫిబ్రవరి నెల నుంచి జూలై చివరివారం వరకు మిర్చి కొనడానికి పల్లె, పట్టణం అనే భేదాభిప్రాయం లేకుండా జనం మిర్చి కొనుగోలు చేయడానికి పోటీ పడుతుంటారంటే ఇక్కడ మిర్చికి ఎంత గిరాకీ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

కనుల పండువగా పద్మావతి, అలువేలుమంగ వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి అనురాధ

అచ్చంపేట, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని అంకిరోనిపల్లి గ్రామంలో శుక్రవారం పద్మావతి అలువేలుమంగ వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా పూజారులు నిర్వహించారు. ఈ కల్యాణం తిలకించేందుకు గ్రామ ప్రజలే కాక పరిసర గ్రామాలనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే సతీమణి అమ్రాబాద్ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ పాల్గొని ఉత్సవాలను తిలకించారు. కల్యాణం అనంతరం స్వామి వారి రథోత్సవాన్ని గ్రామ వీధుల గుండా భక్తులు లాగారు. ఈ సందర్భంగా నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక పోటీలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 16: పాలెం వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండు రోజులుగా చేపట్టిన భజన పోటీల్లో గెలుపొందిన బిజినేపల్లి భజన మండలి సభ్యులకు శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలువురు భక్తులు తులాభారం బంగారం (బెల్లం) సమర్పించారు. రథసప్తమి పురస్కరించుకొని భక్తులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి ఉచిత అన్నదానం చేశారు. ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, జి.నాగరాజు, సొప్పరి బాలస్వామి, గాడి సురేందర్, వెంకటేశ్వర్లు, జగదీష్, వెంకటేష్, బాబయ్య, శివకుమార్, కొంకలి మధు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెన్నచెర్ల విద్యార్థిని ఎంపిక



బ్రసీన్‌బేగం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16 : మండల పరిధిలోని వెన్నచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బ్రసీన్‌బేగం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.వినయ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న కల్వకుర్తిలో జరిగిన సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బ్రసీన్‌బేగంను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాజశేఖర్‌రావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీ రవికుమార్, మాజీ సర్పంచ్ రాధ, సింగిల్ విండో మాజీ చైర్మన్ బాలస్వామి, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

స్వచ్ఛందంగా కంపచెట్లను తొలగించిన యువకులు

కోడేరు, ఫిబ్రవరి 16 : మండల కేంద్రంలోని తెలంగాణ మాడల్ స్కూల్ ఆవరణలో కంపచెట్లను యువకులు సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. శుక్రవారం మాడల్ స్కూల్ ఆవరణలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విష పురుగులకు ఆశ్రయం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయభ్రాంతులకు రోజులు గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న కోడేరు యువక బృందం తమ సొంత డబ్బులతో జేసీబీని ఉపయోగించి కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించారు. పాఠశాల ఆవరణతోపాటు హాస్టల్ చుట్టుపక్కల కూడా శుభ్రం చేశారు. యువకులు ఎండి.బాబు, మాజీ ఎంపీటీసీ శ్రీను, యువజన సంఘం అధ్యక్షుడు వి.సురేష్, చామంతిరాజు, ఎండి.రఫీ, మిద్దెనాగేష్, ఆదిశరత్, ఆదిరాజు, వట్టెల ఈరస్వామి, బాలరాజు, ఎండి.ఉమర్, బాలరాజు, అశోక్, సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకులు రక్తదానానికి ముందుకు రావాలి

కందనూలు, ఫిబ్రవరి 16 : ఆపదలో ఉన్న ప్రతి వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు రక్తదానంతో 45 యూనిట్ల రక్తదానాన్ని జనరల్ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. న్యాయాధికారులు సబిత, మౌనిక, మమతారెడ్డి, శ్రీనిధి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, కార్యదర్శి పర్వత్‌రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ రఘు, డాక్టర్ రోహిత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాస్ పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ బాధ్యతలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 16 : కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిగి మునిసిపల్ కమిషనర్ నుంచి బదిలీపై కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ సొంటె రాజయ్య జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన జి.శ్రీనివాసన్‌కు మునిసిపల్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వట్టెం వెంకన్న ఆలయంలో నాగుపాము



నాగుపామును పట్టుకున్న రిస్క్‌టీం సభ్యుడు

బిజినేపల్లి, ఫిబ్రవరి 16 : బిజినేపల్లి మండలం వట్టెంలోని వెంకన్న స్వామి ఆలయంలోని అన్నదాన సత్రంలోకి గురువారం సాయంత్రం నాగుపాము వచ్చి హల్‌చల్ చేసింది. నాగుపామును చూసిన పూజారులు, భక్తులు భయంతో సత్రం లోపలి నుంచి బయటకు పరుగులు తీశారు. ఆలయ పూజారి వెంటనే పాలెం ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న స్నేక్ క్యాచర్ జగన్‌కు సమాచారం ఇచ్చారు. అన్నదాన సత్రంలో నక్కిన నాగుపామును చాకచక్యంగా పట్టుకొని దానిని జాగ్రత్తగా బుద్దారం అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు.

'మట్టివాసన నా కవితల పుస్తకం ఆవిష్కరణ'

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16 : మట్టి వాసన నా కవితల పుస్తకాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు శుక్రవారం ఆవిష్కరించారు. మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ యడవెల్లి నాగరాజు రాసిన మట్టి వాసన నా కవితల పుస్తకంను డాక్టర్ పగిడాల శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యడవెల్లి నాగరాజును శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు పిల్లిదండు షైబూస్, స్వాములు, జి.వెంకటయ్య, ఎం.చంద్రయ్య, యడవెల్లి బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

19న భోగ్ బండార్ కార్యక్రమం

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : ఈ నెల 19న భోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించే భోగ్‌బండార్ వాల్ పోస్టర్‌ను కల్వకుర్తి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బృంగి ఆనంద్‌కుమార్ ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంఘం నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, వంశీచంద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమానాయక్, నిరంజన్, రమేష్‌నాయక్, దాస్యనాయక్, దేవిలాల్‌చౌహాన్, శంకర్‌నాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకులకు అభినందన

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల గ్రామంలో చిక్కొండ మహేష్, నాప మధు, అనిల్‌కుమార్‌లు కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. శుక్రవారం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల రాములు శాలువా, పూల మాలలతో సత్కరించారు. నాయకులు రవిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, బాలజంగయ్య పాండురంగారెడ్డి, శ్రీనయ్య, మల్లయ్య, బాలరాజు, శ్రీశైలం, రామకృష్ణ, శ్రీహరి, రాజు, ప్రభాకర్, రమేష్, శివ, రాములు, నవీన్, నరసింహ, కృష్ణయ్య, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగ వజ్రోత్సవ సభను జయప్రదం చేయండి'

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 16: అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో రేపు జిల్లా కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్న భారత రాజ్యాంగ వజ్రోత్సవ సభను జయప్రదం చేయాలని మిషన్ అధ్యక్షుడు టి.మద్దిలేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సులో జిల్లాలోని విద్యావంతులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల తిరుపతి.. దేవునితిర్మలాపురం వెంకన్న

- 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం
- 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16 : పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్‌లో వెలిసిన వెంకన్న పేదల తిరుపతిగా వెలుగొందుతున్నాడు. తీరితే తిరుపతి తీరకపోతే తిరుమలాపురానికి అనే నానుడి కూడా ఇక్కడ ఉంది. ఆలయంలో వేంకటేశ్వరస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువుదీరిన స్వామివారు పూజలు అందుకుంటున్నారు. ఆలయానికి 400ఏళ్ల చరిత్ర ఉంది. ఆలయ కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఆలయ బ్రహ్మోత్సవాలు ఏటా మాఘమాసంలో 9రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 20 నుంచి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు.

● బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

ఈ నెల 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం, గజవాహన సేవ, 20న శేషవాహన సేవ, 21న హనుమత్ వాహన సేవ, 22న గరుడ వాహన సేవ, 23న కల్యాణోత్సవం, 24న రథోత్సవం, 25న అశ్వవాహన సేవ, 26న హంసవాహన సేవ, చక్రస్నానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశామని వారు తెలిపారు.

● ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



చారిత్రాత్మకమైన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలి. తిరుమల తిరుపతి స్థాయిలో ఆలయాన్ని అభివృద్ధి పరిచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

- శేషాచారి శర్మ, ఆలయ పూజారి, దేవునితిర్మలాపూర్

● భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశాం

మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో ఈ నెల 18 నుంచి 26వరకు నిర్వహించే వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశాం. ఆ లయ ప్రాంగణంలో వచ్చే భక్తులకు నీటి వసతి, ఉండ టానికి షెడ్లు వంటి వసతులు కల్పించాం. స్వామి వారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలు గకుండా చూస్తాం.

-వి.సత్యం మాజీ సర్పంచ్ దేవునితిర్మలాపూర్



దేవుని తిర్మలాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం

బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

- సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకుల పిలుపు
- కార్మిక సంఘాల ధర్నా

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 16: కేంద్రంలో మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని వామపక్ష పార్టీల కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా శుక్రవారం వామపక్ష పార్టీల కార్మిక సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల కాలంలో కార్మికుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. లేబర్ కోడు బిల్లుతో మోదీ కార్మికుల జీవన స్థితిగతులు మరింత దిగజారాయని విమర్శించారు. దేశానికి సంపదను సృష్టించే కార్మికులకు కనీస వేతన చట్టం అమలుకు నోచుకోక దయనీయ జీవితాలను గడుపుతున్నారని పేర్కొన్నారు. రోబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని వారు హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు వార్ల వెంకటయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, నాయకులు యేసయ్య, నరసింహ, గీత, రామయ్య, అశోక్, లక్ష్మీపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, వెంకట్‌రాములు, వెంకటేశ్వర్లు, ధర్మయ్య, సుమలత, వరలక్ష్మీ, కృష్ణవేణి, చంద్రకళ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్: విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ పేదలను చదువుకు దూరం చే స్తున్న నూతన జాతీయ విద్యా విధానం 2022ని వెంటనే రద్దు చేయాలని ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ పిలు పునిచ్చారు. శుక్రవారం దేశ వ్యాప్త స మ్మెలో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీస నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానించడం హేయమైన చర్య అని విమర్శించారు. ప్రైవేటు యూనిరవర్సిటీలో రిజర్వేషన్లు ఉండవనీ, దీంతో అణగా రిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యారంగంపై అవలం భిస్తున్న నిర్లక్ష్య వైఖరికి రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, క్రాంతి, అభినయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

ఆటో కార్మికుల ర్యాలీ

మన్ననూర్: కార్మిక, రైతు వ్యతిరేక వి ధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభు త్వ తీరును వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్ సందర్భంగా మన్ననూరులో శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై శుక్ర వారం ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహిం చారు. ఆటో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వలన ఆటో కార్మికులు వీధిన పడుతున్నారని, లోటును పూడ్చేందుకు నెలనెలా వేతన సౌకర్యం కల్పిం చాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. మండల ఆటో యూనియన్ సభ్యులు ఎండీ సయ్యద్, నిరంజన్, గోపాల్, జిలాని, లక్ష్మణ్ , మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

కోడేరు: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి రైతు సంఘాలు ప్రతిపాదించిన అంశాలకు చట్టబద్ధత కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గ్రామీణ బంద్‌ను సీపీఎం తరఫున నిర్వహించారు. ఈ సమ్మెకు మద్దతుగా మండల కేంద్రంతోపాటు రాజాపూర్, సింగాయిపల్లి తదితర గ్రామాల్లో బంద్‌ను పాటించారు. సీపీఎంతో పాటు ప్రజా సంఘాల నాయకులు పి.రవి, వి.రవి, లక్ష్మయ్య, డి.శివయ్య, బిచ్చయ్య, శ్రీనివాసులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న కార్మికులు

కల్వకుర్తి: సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్తంగా నిర్వహించిన సమ్మె విజయవంతమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. అనంతరం ఆర్డీవో ఎస్.శ్రీనుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, నాయకులు షానవాజ్‌ఖాన్, గోపాల్, ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు ఏపీ మల్లయ్య, రైతు సంఘం అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మన్ననూరులో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



కల్వకుర్తిలో ఆర్డీవో ఎస్.శ్రీనుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా అరికట్టాలి

- విద్యుత్‌శాఖ పనితీరుపై సభ్యుల అసహనం

బిజినేపల్లి, ఫిబ్రవరి 16: రాబోయ్యే ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడిరాకుండా ప్రణాళికాబద్ధంగా నీటి వనరులను సమీకరించుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశపు హాల్‌లో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని లట్టుపల్లి, బిజినేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అలాగే విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గ్రామాల్లో పాత, ఇనుప స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను వేయాలని ఎన్నోసార్లు వినవించినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు మారకపోతే కార్యాలయం ముందు నిరసన చేపడుతామని అన్నారు. అలాగే బిజినేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలోని షాపుల ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తున్నా ప్రయాణికులకు కనీసం తాగునీటి వసతి ఏర్పాటు చేయలేదన్నారు. బస్టాండ్ ఆవరణ పందులకు ఆవాసంగా మారడంతో ప్రయాణికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నాగర్‌కర్నూల్ బస్సు డిపో డీఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ఆర్టీసీ దుకాణాల్లో టెండరులో చూపిన వ్యాపారాలు చేయకుండా తమకు నచ్చిన వ్యాపారాలు చేసుకుంటూ ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న దుకాణందారుల లైసెన్స్ రద్దు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం వడ్డించకపోవడంతో పాటు తక్కువ ధరకు తెచ్చిన చిన్న సైజు గుడ్ల పెట్టి చిన్నారుల పొట్ట గొడుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు చీర్ధం బాలస్వామి అన్నారు. ఇతర శాఖల్లో ఉన్న సమస్యలపై సభ్యులు ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన విద్యుత్‌శాఖ సమస్యలను వెంటనే ఆయా గ్రామాలను సందర్శించి అవసరమైన పనులు పూర్తి చేయాలని విద్యుత్‌శాఖ ఏఈ మహేష్‌ను ఆదేశించారు. కతాలప్పను సభ్యులు, అధికారులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణయ్య ఎంపీఓ రాములునాయక్, ఎక్సైజ్ ఎస్సై నవీన్ రెడ్డి, సభ్యులు అంజనేయులు, ఊశన్న తదితరులు ఉన్నారు.



సర్వసభ్య సమావేశంలో విద్యుత్‌శాఖ ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు మంగి విజయ్

సీసీ రోడ్డుకు భూమి పూజ

కోడేరు, ఫిబ్రవరి 16 : మండల పరిధిలోని జనుంపల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డుకు గ్రామపంచాయతీ కార్యదర్శి అర్జునయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామంలో సీసీ రోడ్లకు పది లక్షల రూపాయల నిధులతో భూమి పూజ చేసి పనులు ప్రారంభించామన్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న పనులను మంత్రి సహకారంతో పూర్తి చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, కృష్ణయ్య, శివ, రాములు రాజు, కృష్ణయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

'అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించాలి'

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డ మాజీ మంత్రి హరీష్‌రావుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్స్ కుంగితే పునర్నిర్మిస్తామని చెప్పడం అవినీతి జరిగిందని ఒప్పుకోవడమే అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం వంద రోజుల్లో తూచా తప్పకుండా అమలు పరుస్తుందని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అమ్రాబాద్, ఫిబ్రవరి 16 :అమ్రాబాద్ మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి, మాధవానిపల్లి, అమ్రాబాద్, కొత్తపల్లి, మాచారం తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న 11 వర్క్స్ ఐడీ పనులను స్టేట్ క్వాలిటీ కంట్రోల్ టీం అధికారులు కృష్ణారావు, అరవింద్ రెడ్డిలు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఈ పథకం ద్వారా జరుగుతున్న పనుల నాణ్యతతో పాటు కూలీలకు కల్పిస్తున్న ఉపాధి, వలసల నివారణకు తీసుకుంటున్న చర్యలపైన వారు పరిశీలించారు. వారి వెంట ఈసీ రేనయ్య, టెక్నికల్ అసిస్టెంట్ ఆంజనేయులు, పారిజాత తదితరులు ఉన్నారు.

శివనామస్మరణతో మారుమోగిన తాండ్ర



శివ పూజలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో రథసప్తమిని పురస్కరించుకుని శివాలయంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తిశ్రద్ధతో జరిగిన పూజా కార్యక్రమానికి సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, వంగూరు జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పలు వురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వ హించారు. నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, సలేశ్వర్‌గౌడ్, అశోక్, హరీష్‌యాదవ్, నందు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట టీఎన్‌జీవోస్ నిరసన

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 16: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏఐఎస్‌జీఈఎఫ్) పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం టీఎస్‌జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కోశాధికారి ఎండీ.షర్ఫుద్దీన్, సహాధ్యక్షుడు సత్యనారాయణయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నసీర్, ప్రచార కార్యదర్శి సురేష్, నాయులు బాలరాజు, షేక్ కరీముల్లా, చెన్నకేశవులు, రామకృష్ణ, రాజు, శ్రీను, స్కైలాబ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఊర్కొండ, ఫిబ్రవరి 16: మండలంలోని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో విజయ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, ఐకేపీ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీవో నరసింహ, ఏపీఎం సహదేవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : ఎంపీడీవోగా నాగేంద్రం శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. పెద్దకొత్తపల్లిలో గతంలో ఎంపీడీవోగా పని చేసిన కృష్ణయ్య మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలానికి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో వనపర్తి జిల్లా నుంచి నాగేంద్రం బదిలీపై పెద్దకొత్తపల్లి ఎంపీడీవోగా పదవి బాధ్యతలు చేపట్టారు.

● చారకొండ : ఎంపీడీవోగా ఎండీ ఇసాక్‌హుసేన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో జయసుధ బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందడంతో ఎంపీవోగా పనిచేస్తున్న వెంకటేష్ తాత్కాలిక ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. సూర్యపేట జిల్లా మైలచెరువు మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎండీ ఇసాక్‌హుసేన్ బదిలీపై చారకొండకు వచ్చారు.

● అమ్రాబాద్: ఎంపీడీవోగా బి.మోహన్ లాల్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రామ్మోహన్ సిద్దిపేట జిల్లాకు బదిలీ కాగా వెల్దండ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన మోహన్ లాల్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

● తాడూరు : ఎంపీడీవోగా విధులు నిర్వహించిన గంగా మోహన్ బదిలీపై కరీంనగర్ జిల్లాకు వెళ్లడంతో ఆయన స్థానంలో నూతనంగా జ్యోతిపరుషియా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న రోజుల్లో మండల అభివృద్ధికి తమ వంతుగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సూచించారు.

● వెల్దండ: ఎంపీడీవోగా కొప్పుల సత్యపాల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు వనపర్తి జిల్లాకు బదిలీపై వెళ్లగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల ఎంపీడీవో ఉన్న సత్యపాల్‌రెడ్డి వెల్దండకు బదిలీపై వచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, ఉపాధి హామీ పనుల పురోగతికి తనవంతుగా కృషిచేస్తానని ఈ సందర్భంగా సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

● పెంట్లవెల్లి: ఎంపీడీవోగా శుక్రవారం ప్రసన్నకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలో విధులు నిర్వహించారు. ఇక్కడ పని చేస్తున్న రామయ్య ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఉప్పునుంతల, ఫిబ్రవరి 16: మండల కేంద్రమైన ఉప్పునుంతలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. నాయకులు కట్టా అనంతారెడ్డి, చిన్న జంగిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

'ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరగాలి'

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 16 : ఈపాస్ మిషన్ ద్వారానే రైతుకు ఎరువుల అమ్మకాలు జరగాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి షాపు యజమానికి పలు సూచనలు, సలహాలు చేస్తూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. షాపులో నిల్వ ఉన్న ఎరువులు వివరాలను రికార్డులతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు పురుగు మందులు రైతుకు అమ్మితే రశీదు ఇవ్వాలన్నారు. నిషేధిత ఎరువులు, పురుగుల మందులు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

అమ్మాయిలు చదువుకుంటేనే విలువ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 16 : సమాజంలో అమ్మాయిలు చదువుకుంటేనే అవనిలో విలువ ఉంటుందని ఉమెన్స్ హబ్ సభ్యురాలు అనిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఉమెన్స్ హబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమెన్స్ హబ్ సభ్యురాలు అనిత మాట్లాడుతూ అమ్మాయిలు కష్టపడి చదివి భవిష్యత్తులో గొప్పగా ఎదగాలని ఆమె అన్నారు. ఎన్ని కష్టాలొచ్చినా చదువును మానేయవద్దని ఆమె సూచించారు. అమ్మాయిలు చదువుకుంటేనే అవనిలో విలువ ఉంటుందని ఆమె తెలియజేశారు. అదేవిధంగా సుకన్య సమృద్ధి యోజన పథకం బాలికల విద్యా ప్రాముఖ్యత, మహిళా పొదుపు పథకాలపై మొదలగు అంశాలపై ఆమె వివరించారు. పాఠశాల హెచ్ఎం మద్దిలేటి, ఉపాధ్యాయురాలు మేరీ, సునీలా, పార్వతమ్మ, ప్రమీల, ఎండి.షాహీన్‌బేగం, సరళాదేవి, స్వాతి, నందీశ్వర్, దేవయ్య, రాఘవేందర్, సాయిశంకర్, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతరకు బస్సులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వ పండుగగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సమ్మక్క సారక్క జాతరకు కొల్లాపూర్ ఆర్టీసీ డిపో నుంచి బస్సులను పంపుతున్నట్లు కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి కొన్ని బస్సులు, 20వతేదీ మంగళవారం రోజు మరికొన్ని బస్సులు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకు డిపోలోని బస్సులను జాతరకు పంపుతున్నందున ప్రయాణీకులు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించగలరని డిపో మేనేజర్ ఉమాశంకర్ కోరారు.

'ఎంపీగా పోటీ చేసే అవకాశమివ్వాలి'

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : నాగర్‌కర్నూల్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఏఐసీసీ ట్రైనింగ్ కోఆర్డినేటర్, న్యాయవాది మల్లెపల్లి జగన్ కోరారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా, నాయకుడిగా పని చేస్తున్నానని అన్నారు. ఎస్సీ సెల్ నాయకులు వెంకటయ్య, నిరంజన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కందనూలు, ఫిబ్రవరి 16 : అసంక్రమిత వ్యాధుల మూడవ విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కే సుధాకర్‌లాల్ పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధుల మూడవ విడత స్క్రీనింగ్ పరీక్షలు త్వరలో ప్రారంభిస్తున్నామని అందులో భాగంగా నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని పల్లె దవాఖాన వైద్యాధికారులకు, స్టాఫ్‌నర్సులకు, పర్యవేక్షణ అధికారులకు శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ కే సుధాకర్‌లాల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వెంకటదాస్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి కృష్ణమోహన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవికుమార్, డాక్టర్ తారాసింగ్, డాక్టర్ ప్రదీప్, వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి క్షీరాభిషేకం

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 16: తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన తీర్మానానికి ఆమోదం తెలుపడంతో శుక్రవారం పట్టణంలోని రాజీవ్ చౌర స్తాలో మహాత్మాజ్యోతిబా పూలే చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు రామనాథం, కాశన్న యాదవ్, శరన్‌గౌడ్, రవీందర్, శ్రీశైలం, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.